సాక్షి
వికారాబాద్
సోమవారం । 15 । మే । 2023




పశువైద్యుల భర్తీ ఎప్పుడో.?

మూగజీవాలకు వైద్యం అందించే శాఖలో డాక్టరు పోస్టులు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. సకాలంలో జీవాలకు వైద్యం అందడంలేదు. 8లో▸



ప్రభుత్వ భవనాల కూల్చివేత

ప్రభుత్వ భవనాలు స్థానిక నాయకులకు ఆదాయ వనరులుగా మారాయి. కాలపరిమితి ముగియక ముందే కూల్చేస్తున్నారు. 8లో▸



పచ్చదనంపై గొడ్డలి వేటు!

ఓ వైపు ప్రభుత్వం పర్యావరణానికి పాటుపడుతుంటే మరోవైపు అడవులు ఇష్టారాజ్యంగా గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

డిగ్రీ గురుకుల ఎంట్రెన్స్‌లో విద్యార్థుల హవా



శ్రీకాంత్ (5వ ర్యాంక్)



గౌరి బాయి (13వ ర్యాంక్)



మహేశ్ (51వ ర్యాంక్)



జ్యోతి (69వ ర్యాంక్)

వికారాబాద్ అర్బన్: గురుకుల డిగ్రీ ప్రవేశ పరీక్షల్లో వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన బ్యాగరి శ్రీకాంత్ రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్, గౌరిబాయి 13వ ర్యాంక్, నీరటి మహేశ్ 51వ ర్యాంక్, పత్లావత్ జ్యోతి 69వ ర్యాంక్, పద్మ 350వ ర్యాంక్ సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేశ్వర్ స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన వారంతా హెచ్ఈసీ గ్రూపునకు చెందిన వారే ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు గురుకుల ఎంట్రెన్స్ రాసే విధంగా ప్రోత్సహించడంతో పాటు, వారికి సరైన మార్గదర్శనం చేసిన చరిత్ర ఉపన్యాసకుడు శాంరాజ్‌ను ఆయన అభినందించారు.

ద్విచక్ర వాహనదారులకు నేడు అవగాహన సదస్సు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీఎస్పీ బీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, పలువురు అధికారులు విచ్చేస్తున్నారన్నారు. అంతకుముందు సాయంత్రం ఐదుగంటలకు ఎన్నెపల్లి చౌరస్తా నుంచి సత్య భారతి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీలో వాహనదారులు హెల్మెట్ ధరించి పాల్గొనాలని సూచించారు.

నేడు ఫాక్స్‌కాన్‌కు భూమిపూజ

- భారీగా తరలిరండి
- మంత్రి సబిత పిలుపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ ఫాక్స్‌కాన్ సంస్థ జిల్లాలో తన కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోందని, సోమవారం ఉదయం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమిపూజ నిర్వహిస్తున్నట్లు మంత్రి సబితారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మొదటి దశలో రూ.1,656 కోట్లతో 196 ఎకరాల్లో ఫాక్స్‌కాన్ సంస్థ తన ఉత్పత్తులను ప్రారంభిస్తుందని వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోకి వచ్చిన అతి పెద్ద పెట్టుబడుల్లో ఇది అత్యంత ముఖ్యమైందని పేర్కొన్నారు. ఈ సంస్థ పూర్తి స్థాయిలో తన ఉత్పత్తులను ప్రారంభిస్తే లక్ష మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఒకే సంస్థ ద్వారా ఇంత మందికి నేరుగా ఉద్యోగాలు లభించడం అరుదైన విషయమని ఆమె పేర్కొన్నారు.

రూపురేఖలు మారుతున్నాయి

రంగారెడ్డి జిల్లాలో రూ.64 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యంతో 20,000 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఫార్మాసిటీలో పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటైతే 5.60 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పారిశ్రామిక రంగానికి నవశకం ప్రారంభమైందన్నారు. ఇప్పటికే ఫ్యాబ్ సిటీ, హార్డ్‌వేర్ పార్క్, ఐటీ టవర్స్, పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసుకున్నామని, వీటి ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని మంత్రి తెలిపారు. నూతన పరిశ్రమలతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: ఫాక్స్‌కాన్ ఏర్పాటుకు సోమవారం ఉదయం భూమిపూజ అనంతరం నిర్వహించే బహిరంగసభకు పెద్ద సంఖ్యలో పార్టీశ్రేణులు, ప్రజలు హాజరుకావాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆదివారం అధికారులు, ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ఐటీ, ఈసీ డైరెక్టర్ సుజయ్, టీఎస్ఐఐసీ సీఈఓ మధుసూదన్, ఫాక్స్‌కాన్ తెలంగాణ మేనేజర్ బ్రయన్‌కోర్, డీసీపీ శ్రీనివాస్‌తో చర్చించారు. ఫాక్స్‌కాన్‌లో 35 వేల మందికి ఉపాధి లభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

గీ బియ్యం ఎట్ల తినాలె?



నాసిరకంగా ఎర్రరంగుతో ఉన్న రేషన్ బియ్యం

- రేషన్ దుకాణాల్లో నాసిరకం బియ్యం
- ఎర్ర రంగు.. నూకలు.. ముక్కవాసన
- వండుకునేందుకు పనికిరావంటున్న పేదలు
- మాకొద్దంటూ నిరాకరిస్తున్న లబ్ధిదారులు



దౌల్తాబాద్: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం నాసిరకంగా ఉంటున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం వండుకునేందుకు వీలు లేకుండా ఉన్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం ఎర్రరంగు.. నూకలు.. ముక్కవాసనతో ఉన్నాయని మండిపడుతున్నారు. రేషన్‌దుకాణాల్లో ఇలాంటి బియ్యమే ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో లబ్ధిదారులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తీసుకున్న బియ్యం వండుకోలేక బయట పారేయలేక ముద్దలుగా మారుతున్న అన్నాన్నే అతికష్టం మీద మింగి కడుపు నింపుకొంటున్నారు పేదలు. మండల వ్యాప్తంగా అత్యధికంగా రేషన్‌దుకాణాలకు ఈ బియ్యమే సరఫరా అయినట్లు సమాచారం.

అస్తవ్యస్తంగా పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. ఒక వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున ఇస్తున్నారు. రేషన్‌దుకాణం పరిధిలో లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం కోటా కేటాయిస్తోంది. అయితే మండల పరిధిలోని రేషన్ దుకాణాలలో పంపిణీ అంతా అస్తవ్యస్తంగా తయారైంది. దుకాణాలకు స్టాక్ సైతం సకాలంలో రావడంలేదు. సుమారుగా 10 షాపులకు వచ్చిన బియ్యం పురుగుపట్టి చిట్టాలు కట్టడంతో పాటు ముక్కవి ఉన్నవి సరఫరా అయ్యాయి.

తనిఖీలపై అనుమానాలు?

బియ్యం సరఫరా చేసే సమయంలో పౌర సరఫరా శాఖకు చెందిన క్వాలిటీ కంట్రోలు అధికారులు పరీక్షించి నాణ్యతగా ఉంటేనే సరఫరా చేసేందుకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. క్వాలిటీ కంట్రోలు అధికారులు ఓకే చెప్పిన బియ్యాన్నే రేషన్ దుకాణాలకు కింది స్థాయి అధికారులు గోదాం ఇన్‌ఛార్జిలు సరఫరా చేస్తారు. ముక్కి పురుగుపట్టిన బియ్యం రావడంతో క్వాలిటీ కంట్రోలు అధికారులు తనిఖీ చేశారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో బియ్యం మరీ అధ్వానంగా ఉన్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

వ్యర్థాల కొండ.. అధికారుల అండ



మేడికొండ సమీపంలోని బొక్కల ఫ్యాక్టరీలో జంతు వ్యర్థాలు

ఊరు పేరు మేడికొండ.. ఎటుచూసినా జంతుకళేబరాలే.. సమీప గ్రామాల్లోసైతం భరించలేని దుర్గంధం.. పొలాల్లో పనులు చేసుకోలేని పరిస్థితి. జంతు వ్యర్థాలతో, యముకలతో నూనెలు తయారు చేస్తున్నా ఎవరికీ పట్టని దుస్థితి. కళ్లెదుటే అక్రమాలు జరుగుతున్నా.. రైతులు, ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా.. సాక్షాత్తు అప్పటి కలెక్టర్ ఆదేశించినా.. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులు ఇచ్చే మామూళ్ల వల్లే చర్యలు చేపట్టడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.

మేడికొండలో యథేచ్ఛగా బొక్కల ఫ్యాక్టరీ నిర్వహణ

- దుర్గంధంలో పల్లెలు
- రోగాలబారిన ప్రజలు
- పొలం పనులు సైతం చేసుకోలేని పరిస్థితి
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పాలకులు

వికారాబాద్: పూడూరు మండలం మేడికొండ శివారులో, దారూరు మండలం దోర్నాల్‌లో దశాబ్దం క్రితం జంతువుల వ్యర్థాలు ఎముకలు తీసుకు వచ్చి నూనె తయారు చేసే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ ఫ్యాక్టరీల ద్వారా వచ్చే దుర్వాసన, మలిన పదార్థాలతో ఆ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తమ పొలాల్లో పనులు చేసుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో నాటి నుంచి నేటి వరకు ఆ ప్రాంత ప్రజలు, రైతుల ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతూనే ఉన్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. మామూళ్ల మత్తులో అధికారులు, నాయకులు జోగుతుండటంతో అక్రమార్కులు యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశించినా..

రెండు మూడేళ్లుగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్గంధం మరింత పెరిగిపోతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రైతులు, గ్రామస్తులు, కొందరు నాయకులు అప్పట్లో కలెక్టర్ ను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. స్పందించిన అప్పటి కలెక్టర్ ఆ ఫ్యాక్టరీని సీజ్ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వెంటనే వెళ్లి ఆ ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. దీంతో రైతులు, ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ కొద్ది రోజులకే మళ్లీ ఆ ఫ్యాక్టరీ తిరిగి దందాను ప్రారంభించింది. గుట్టు చప్పుడు కాకుండా జంతు వ్యర్థాలు, బొక్కలతో మళ్లీ నూనె తయారీ ప్రారంభించింది. నియంత్రించాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజల సమస్య మొదటికొచ్చింది. ఇదే విషయమై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదు.



జంతు వ్యర్థాలతో తయారు చేస్తున్న నూనె..

ఫ్యాక్టరీలను తొలగించాల్సిందే

గ్రామాల శివారులో వ్యవసాయ పొలాల మధ్య ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసే సమయంలోనే గ్రామస్తులు వ్యతిరేకించారు. కార్యకలాపాలేవి జరగడం లేదంటూనే గోప్యంగా బొక్కలతో నూనె తయారీ ప్రారంభించారు. దీంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. దుర్గంధం భరించలేక అప్పటి కలెక్టర్‌కు విన్నవించగా సీజ్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే ఆ వెంటనే గుట్టుగా ఫ్యాక్టరీలో కార్యకలాపాలు ప్రారంభించారు. ఏమైనా అంటే బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా నాయకుడు



ట్రాక్టర్‌తో పొలం చదును చేస్తున్న రైతు

యంత్రాల హోరు.. సాగు పనుల జోరు



జేసీబీ సాయంతో చెట్ల తొలగింపు

కొడంగల్ నియోజకవర్గంలో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులు వానాకాలం సీజన్‌కు సిద్ధమవుతున్నారు. ఎద్దు.. ఎవుసం కనుమరుగు కావడంతో యంత్రాలతో పొలం పనులు చేయిస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో అధిక మొత్తంలో నల్లరేగడి భూములున్నాయి. కొన్ని చోట్ల ఎర్ర నేలలు, చెల్కలు ఉన్నాయి. ఖరీఫ్‌లో ఎక్కువ భాగం కంది, పత్తి వేయడానికి పొలాలను చదును చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఎలాంటి సాగునీటి వనరులు లేకపోవడంతో కేవలం వర్షాల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. కంది, పత్తి, జొన్న, శనగ, పెసర, మినుము, వరి, వాము, కుసుమ పంటలను పండిస్తున్నారు.

– కొడంగల్

నడుస్తూ.. సమస్యలు ఆలకిస్తూ

- కొనసాగుతున్న భట్టి పాదయాత్ర

కొందుర్గు: పీపుల్స్ మార్చ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో కొనసాగుతున్న భట్టి విక్రమార్క పాదయాత్రకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, మహిళలు, విద్యార్థులతో మాట్లాడారు. మండలంలోని ఉమ్మెంత్యాలలో రైతు జైపాల్‌తో సంభాషించారు. రుణ మాఫీ చేశారా అని అడగగా ఇంకా కాలేదని తెలిపాడు. అనంతరం భట్టి విక్రమార్క పొలంలోకి వెళ్లి రైతు నుంచి అరక తీసుకొని తోలాడు. కాంగ్రెస్ పాలన వస్తేనే రైతులు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం వడ్రంగి వద్దకు వెళ్లి అతడి మాట్లాడి బాడిసెతో కట్టెను చెక్కే యత్నం చేశాడు. మహిళలతో మాట్లాడగా వారు తమ గ్రామానికి సరిగ్గా బస్సు రావడం లేదని, రోడ్డు బాగాలేదని, పాఠశాలలో ఉపాధ్యాయులు లేక పిల్లలు సరిగ్గా చదవడం లేదని వివరించారు. అనంతరం సాయంత్రం లూర్దునగర్ నుంచి పాదయాత్ర బయలుదేరి కొందుర్గు మండల కేంద్రం నుంచి జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ మీదుగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం తొండుపల్లికి చేరుకుంది.



తొండుపల్లిలో బస

పరిగి: సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపడుతున్న పీపుల్స్ మార్చ్ ఆదివారం రాత్రి మండల పరిధిలోని తొండుపల్లికి చేరుకోవడంతో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పరశురాంరెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. బట్టి గ్రామ సమీపంలో బస చేశారు.

ఢిల్లీకోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

కర్ణాటక ఫలితాలతో కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని, రానున్న ఎన్నికల్లో ఇక్కడ తెలంగాణ, అక్కడ ఢిల్లీ కోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని భట్టి విక్రమార్క అన్నారు.

కాగ్నాలో బాలుడి మునక



బాలుడి మృతదేహం

- దైవ దర్శనానికి వచ్చి అనంతలోకాలకు
- మృతి చెందిన బాలుడు నగరంలోని బోరబండవాసి

ధారూరు: కాగ్నా నది చెక్‌డ్యామ్‌లో బాలుడు మునిగి మృతి చెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెలువు రోజు కావడంతో హైదరాబాద్‌లోని బోరబండ బాబాసైలానీనగర్‌కు చెందిన ఎ.చంద్రకాంత్ కుటుంబం..బంధువులతో కలిసి ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ ప్రాంగణానికి చేరుకున్నారు. ముందుగా శిలువ వద్ద ప్రార్థనలు చేశారు.భోజనాల కోసం వంట పనుల్లో నిమగ్నమయ్యారు. చంద్రకాంత్ కుమారుడు సమజ్ఞాన్(13),కొంతమంది పిల్లలతో కలిసి సమీపంలోని కాగ్నానది చెక్‌డ్యాం నీటిలోకి దిగారు. సమజ్ఞాన్ లోతైన నీటిలోకి జారిపోయాడు. భయపడిన మిగిలిన పిల్లలు పరుగున వచ్చి చెప్పడంతో వెంటనే కుటుంబీకులు నీటిలో దిగి బాలుడిని బయటకు తీసి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.తండ్రి చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం



సాయిరెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

- వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సాయిరెడ్డి నియామకం

పరిగి: ఊరూరా కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరిచేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సయ్యద్‌పల్లికి చెందిన భూమన్నగారి సాయిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లాలో ఎన్నో కార్యక్రమాలు చేశారని ముమ్ముందు కూడా అలాగే చేయాలని సూచించారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసిన వారిని పార్టీ ఎల్లప్పుడూ గుర్తిస్తుందన్నారు. యువకులను చైతన్యపరిచి యువజన కాంగ్రెస్‌ను పటిష్టపరచాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి పథకాలను అందించింది, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా దోచుకుంటుందో వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, రామకృష్ణారెడ్డి, విద్యాధర్‌రెడ్డి, బస్వరాజ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

జేఏసీ జిల్లా చైర్మన్ గోపాల్

కొడంగల్ రూరల్: వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 18న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేయనున్నట్లు వీఆర్ఏల జేఏసీ జిల్లా చైర్మన్ గోపాల్ అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి వీఆర్ఏలు అందరూ హాజరవ్వాలని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేస్తూ.. అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

వాచ్‌మన్ మృతి



నర్సింలు (ఫైల్)

పరిగి: డివైడర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఓ వాచ్‌మన్ మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని పద్మావతి కాలనీకి చెందిన నర్సింలు(55) మహేంద్ర ట్రాక్టర్ షోరూంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సాయంత్రం బైక్‌పై గ్రీన్‌ల్యాండ్ దాబా ఎదుట నుంచి పట్టణ కేంద్రానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేఎన్‌పీఎస్ బలోపేతానికి కృషి చేయండి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్

కొడంగల్ రూరల్: కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్)ని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జయరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రావులపల్లిలో కేఎన్‌పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలపై కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను జయప్రదం చేస్తూ సమితిని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.చంద్రప్ప, సభ్యులు నాగార్జున, లక్ష్మీనారాయణ, అంజిలప్ప, బలరాం తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం



ప్రజలకు అభివాదం చేస్తున్న బండ ప్రకాశ్, ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు అంచె రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. పార్టీలు, జెండాలు ఏవైనా ముదిరాజ్‌ల ప్రయోజనాలే తమకు ముఖ్యమని అన్నారు. హక్కుల సాధన కోసం తెగించి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. నాటి నిరంకుశ నిజాం పాలనను ఎదురించి సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు పండుగ సాయన్న ఎంతో కృషి చేశారని కొనియాడారు. వీరత్వాన్ని ప్రదర్శించిన ఆయన జీవిత చరిత్ర గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ మహనీయుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. అంతకుముందు పట్టణంలో రైల్వే స్టేషన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ముదిరాజ్ సంఘం నాయకులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

పశువైద్యుల భర్తీ ఎప్పుడో.?

పశుసంవర్థక శాఖలో వైద్యుల కొరత పీడిస్తోంది. మండల వ్యాప్తంగా ఆరుగురు వైద్యుల ఒక్కరిపైనే భారం పడుతోంది. ఉన్న ఒక్క డాక్టర్ సమీక్షలకు వెళ్లినప్పుడు పశుపోషకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువైద్యుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

- సబ్ సెంటర్లలో వైద్యుల కొరత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు



దేవనూరు పశువైద్యశాల సబ్‌సెంటర్

యాలాల: మూగజీవాలకు వైద్యం అందించే శాఖలో డాక్టరు పోస్టులు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. ఏళ్ల నుంచి ఒకే వైద్యుడు మండల పరిధిలోనలి జీవాలకు వైద్యం అందిస్తున్నప్పటికీ అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ప్రజలు వ్యవసాయ రంగంపై ఎక్కువగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

పాడి రైతులు, జీవ సంపద ఎక్కువగా ఉన్న మండలంగా యాలాలకు పేరుంది. మండలంలో మొత్తం ఆవులు, ఎడ్లు 9,200, గేదెలు 3,200, గొర్రెలు 10 వేలు, మేకలు 13వేలు, పౌల్ట్రీ 10వేల వరకు పశు సంపదను కలిగి ఉంది. మండల కేంద్రంలోని పశు వైద్యశాలతో పాటు తిమ్మాయిపల్లిలో మరో వైద్యశాల, దేవనూరు, పగిడియాల, అగ్గనూరు, జుంటుపల్లి గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉన్నాయి. అయితే వీటిలో రెండు వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తిమ్మాయిపల్లిలో(వీఏఎస్), దేవనూరులో లైవ్ స్టాక్ అసిస్టెంట్, జుంటుపల్లిలో వెటర్నరీ అసిస్టెంట్(వీఏ), పగిడియాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్(జేవీఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతీ వర్షాకాలంలో పశువులకు జబ్బువాపు, గొంతువాపు, గొర్రెలు, మేకలకు చిటుకు రోగం, గాలికుంటు తదితర జబ్బులు సోకే అవకాశం ఉంటుంది. అయితే ఆయా పశువులకు అత్యవసర చికిత్స అందించేందుకు సబ్‌సెంటర్లలో వైద్యులు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో అందుబాటులో ఉన్న సమయంలో మండల కేంద్రంలో ఉన్న వైద్యుడు అత్యవసర పరిస్థితుల్లో చికిత్స చేసేందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉన్న ఒకే ఒక్క వైద్యుడు శ్రీకర్‌రెడ్డి ప్రతీ వారం జిల్లాకేంద్రంలో నిర్వహించే సమీక్షలు, సమావేశాలకు హాజరవ్వాల్సి ఉంటుంది. దీంతో వైద్య సేవలకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే పశువైద్యులను భర్తీ చేస్తే ఇబ్బందులు ఉండవని రైతులు సూచిస్తున్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



అనంతగిరి: ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో శివలింగం, నంది, నాగదేవతా, నవగ్రహ సహిత, ధ్వజస్తంభ, నాభిశిల ప్రతిష్ఠానోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పూజలకు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సమన్మానించారు. ఈ పూజల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

మర్పల్లి: ప్రతీ ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో ఆదివారం పార్వతి సోమేశ్వర ఆలయంలో గణపతి, సుబ్రమణ్యస్వామి, నవగ్రహ, నందీశ్వర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జెడ్పీటీసీ మధుకర్‌తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందిర, ఎంపీటీసీ సభ్యుడు మహేశ్, మాజీ సర్పంచ్ సురేశ్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గఫార్ ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు.

లిఫ్ట్ ఇచ్చి.. నగలు చోరీ



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ అప్పయ్య

- సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి గుర్తింపు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ధారూరు: బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలకు పుట్టింటికి వచ్చి వెళ్తున్న మహిళకు గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ ఇచ్చి ఆమె మెడలోని బంగారు గుండ్లు, పుస్తెలతాడును తెంపుకుని పరారయ్యాడు. ఈ ఘటన ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అప్పయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ గ్రామానికి చెందిన బండారి బుజ్జమ్మ తన తల్లిగారి ఇళ్లు గడ్డమీది గంగారంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలకు ఈ నెల 10న వెళ్లింది. 11న సాయంత్రం ఒంటరిగా స్వగ్రామానికి బయలుదేరింది. బైక్‌పై వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆమెకు లిఫ్ట్ ఇచ్చి నర్సాపూర్ గేట్ వద్ద దించాడు. చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకున్న వ్యక్తి బైక్‌పై ఆమెను అనుసరిస్తూ వెళ్లి మెడలోని బంగారు గుండ్లు, పుస్తెలతాడును తెంచుకుని పరారయ్యాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా బంట్వారం మండల కేంద్రానికి చెందిన జడల శివకుమార్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో నేరం ఒప్పుకోవడంతో అతడి వద్ద నుంచి చోరీ చేసిన బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన ఎస్ఐలు ఆనంద్, సంతోష్ కుమార్, సిబ్బందిని ఆయన అభినందించారు . గుర్తు తెలియని వ్యక్తులు లిఫ్ట్ ఇస్తామంటే గుడ్డి నమ్మి వెళ్లొద్దని ధారూరు సీఐ అప్పయ్య సూచించారు. ఎవరైనా లిఫ్ట్ ఇస్తామని మిమ్మల్ని పిలిచినా, బైక్‌పై దూసుకొచ్చి మీ పక్కన ఆపి పద వెళదాం అన్నా .. 100 నెంబర్‌కి ఫోన్ చేయాలన్నారు.

ప్రభుత్వ భవనాల కూల్చివేత



కూల్చివేతలు ప్రారంభమైన తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇనుప సామగ్రి

- ఐరన్ విక్రయిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

తాండూరు: ప్రభుత్వ భవనాలు స్థానిక నాయకులకు ఆదాయ వనరులుగా మారాయి. భవన నిర్మాణాల కాలపరిమితి ముగియక ముందే శిథిలావస్థకు చేరాయంటూ నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేస్తున్నారు. అందులో వచ్చిన ఇనుము బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ డబ్బులు వెనుకేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు.

కౌన్సిలర్ ఫిర్యాదు

పట్టణంలోని రైతు బజార్ ప్రాంగణంలో రైతులు పంటలను నిల్వచేసుకునేందుకు రెండు దశాబ్దాల క్రితం గిడ్డంగులను నిర్మించారు. అయితే ఏడాది క్రితం సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం మార్కెట్ కమిటీ నుంచి మున్సిపాలిటీకి స్థలాన్ని బదలాయించారు. దీంతో మార్కెట్ యార్డులోని ఐదు భారీ గిడ్డంగులను ఇటీవల కూల్చివేశారు. అందులో వచ్చిన ఇనుప చువ్వలను నిబంధనల ప్రకారం మున్సిపల్ అధికారులు వేలం వేయాలి. కానీ ఇందుకు విరుద్ధంగా కాంట్రాక్టరే రూ.లక్షల విలువైన ఇనుమును అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడని ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్ అక్రమంగా గిడ్డంగుల కూల్చివేతలు చేపట్టారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

అధికారులకు తెలిసినా..

మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ఇటీవల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో కళాశాల పాతభవనం కూల్చివేతలు ప్రారంభించారు. భవనం కూల్చిన సమయంలో వచ్చిన రూ.లక్షల విలువ కలిగిన ఇనుమును స్క్రాప్‌ను విక్రయించేందుకు తరలించారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రకాశ్

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్

షాద్‌నగర్: కేసీఆర్ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో మండలంలోని బూర్గుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ప్రకాష్ బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నేత అని అన్నారు. ఆయన నాయకత్వం దేశానికి ఎంతో అవసరం అని అన్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సీ ఎల్లయ్య, బీ రవీందర్, రమేష్, జంగయ్య, నర్సింలు, మల్లయ్య, రమణ, జంగయ్య, రాజ్‌కుమార్, బాలయ్య, వెంకటయ్య, పోచయ్య, జగన్, శ్రీను, యాదగిరి, రాజేందర్, అంజయ్య, సాయిలు, శ్రీనివాస్, బీ రమేష్, గణేష్, ఎల్ రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయకులు రాఘవేందర్‌గౌడ్, వీరేశం పాల్గొన్నారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పహాడీషరీఫ్: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి చెరువులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చూసిన గ్రామానికి చెందిన అబ్బు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి వయస్సు 35 - 40 ఏళ్ల నడుమ ఉంటుందని, ఒంటిపై నలుపు, తెలుపు రంగులో షర్ట్, మెరూన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాయి. చెరువు ఒడ్డుపై బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్, నీలం రంగు ప్యారాగాన్ చెప్పులు ఉన్నాయి. ఈ ఆనవాళ్లు సరిపోలిన వారు కనిపించకపోతే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా సెల్ నంబర్ 87126 62367లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

గోవా నుంచి మద్యం తెస్తే కేసులు



స్పెషల్ డ్రైవ్‌లో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాజేంద్రనగర్: గోవాతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి మద్యాన్ని తీసుకొచ్చిన వారిపై ఎక్సైజ్ శాఖ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. వారం రోజులుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. గోవా నుంచి మద్యాన్ని తీసుకొస్తున్న వారిని గుర్తించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. గోవాకు వెళ్లిన వారు తమ వెంట బాటిళ్లు తీసుకొస్తున్నారని తమకు సమాచారం ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. గోవాకు వెళ్లిన వారు తమ వెంట మద్యం బాటిళ్లను తీసుకురావొద్దని సూచించారు. ఎవరైనా తీసుకొస్తే వారిని గుర్తించి ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.అలాగే ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా మద్యంను తీసుకొచ్చి ఇక్కడ విక్రయించిన లేదా తమ ఇళ్లల్లో స్టాక్ పెట్టుకున్నా... నేరమన్నారు. రాష్ట్రంలో తయారైన రాష్ట్రంలో విక్రయించే బాటిళ్లను మాత్రమే వినియోగించాలన్నారు.

విదేశీ మద్యం స్వాధీనం

అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతానికి చెందిన బి.జనార్ధన్ రెడ్డి, అగర్వాల్ వద్ద విదేశీ మద్యం ఉందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ పోలీసులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబ కాలనీలోని పోచమ్మ దేవాలయానికి సంబంధించిన కమాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తోరణం, పోతురాజు, నాగుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచ్ పడితే పతకమే



ప్రత్యర్థితో తలపడుతున్న సోనియా

- కరాటేలో రాణిస్తున్న గిరిపుత్రిక సోనియా
- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్

కడ్తాల్: జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాణిస్తూ, అందరి చేత శభాష్ అంటూ జేజేలు అందుకుంటోంది.. గిరిపుత్రిక సోనియా.. లక్ష్యాన్ని సాధించాలనే ఆశయం, పోటీ ఏదైనా గెలవాలనే పట్టుదల, ఆత్మ విశ్వాసం సోనియా సొంతం. మండలంలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన సభావత్ గేండా నాయక్, బుజ్జి దంపతుల మూడో సంతానం సభావట్ సోనియా. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తారు. సోనియా చదువుతో పాటు, కరాటేలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. మూడో తరగతి చదువుకునే సమయంలోనే మాస్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందింది. సోనియాలోని పట్టుదలను చూసిన మాస్టర్ ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. మొదటి సారిగా 2012లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని పతకం సొంతం చేసుకుంది. అప్పటి నుంచి పలు చోట్ల జరిగిన పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తూ వస్తోంది. సోనియా బరిలోకి దిగిందంటే పతకాలు వరించాల్సిందే అన్నంత పేరు తెచ్చుకుంది.

ఓ వైపు పతకాలు.. మరోవైపు కోచ్‌గా..

ఓ వైపు సోనియా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొంటునే మరో వైపు తాను నేర్చుకున్న విద్యను పది మందికి పంచాలనే తపనతో శిక్షణ ఇస్తోంది. మరి కొందరిని కరాటేలో తీర్చిదిద్దుతోంది. అంతేకాకుండా కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. సోనియా ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం ఇటీవలే పూర్తి చేసింది.

సాధించిన పతకాలు

- 2012లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో విజేతగా నిలిచింది.
- 2013లో కొందుర్గులో విక్టోరియా బుడోఖాన్ ఆల్ ఇండియా కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది.



సాధించిన పతకాలతో సోనియా

- 2014లో కొస్గిలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గ్రాండ్ చాంపియన్ షిప్‌ను సొంతం చేసుకుంది.
- 2015లో వరంగల్‌లో జరిగిన 6వ జాతీయ స్థాయి షోటోకాన్ కరాటే పోటీల్లో విజేతగా నిలిచింది.
- 2016లో పటాన్ చెరువులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విజయం సాధించింది.
- 2017లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకాన్ని దక్కించుకుంది.
- 2018లో కరీంనగర్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సొంతం చేసుకుంది.
- 2019లో వరంగల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది.
- 2020 విశాఖలో జరిగిన ఆసియా కరాటే పోటీల్లో విజేతగా నిలిచింది.
- 2021లో గోవాలో జరిగిన కరాటే పోటీల్లో టైటిల్ తోపాటు బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.
- 2022లో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించింది.

స్పోర్ట్స్‌గా గుర్తించాలి

ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆపద సమయంలో, ఇతరులకు సాయం చేయడానికి ఉపయోగపడుతుంది. కరాటేను స్పోర్ట్స్‌గా గుర్తించాలి. ప్రస్తుతం విదేశాల్లో కరాటేకు మంచి గుర్తింపు ఉంది. మన దేశంలోనూ ప్రాధాన్యత ఇవ్వాలి.

– సోనియా, కరాటే క్రీడాకారిణి, కోచ్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మున్సిపల్ తిమ్మాపూర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాళ్‌కు చెందిన గోపాల్(38) ఉపాధి కోసం ఐదు రోజుల క్రితం కొత్తూరుకు వచ్చాడు. తెల్లవారుజామున కాలినడకన తిమ్మాపూర్ నుంచి శంషాబాద్ వైపునకు వెళుతుండగా వెనక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

కుక్కను తప్పించబోయి..

పహాడీషరీఫ్: కుక్కను తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు కిందపడి మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ హరూన్ కాలనీకి చెందిన సయ్యద్ అన్వర్ కుమారుడు సయ్యద్ షానవాజ్(21) డ్రైవర్. ఆదివారం తెల్లవారుజామున వాదే ముస్తఫా బస్తీలో వలీమా డిన్నర్ ముగించుకొని తన బైక్‌పై వస్తున్నాడు. షాహీన్‌నగర్‌లోని ఓ ఆసుపత్రి వద్దకు రాగానే కుక్క అడ్డం వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరు..

చేవెళ్ల: అతివేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన నిలుచున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌కు చెందిన రాములు(55) గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గ్రామ శివారులో గేదెలను మేపేందుకు వెళ్లాడు. కంచెలో గేదెలు మేస్తుండగా హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి పక్కన నిలబడ్డాడు. నగరం నుంచి అతివేగంతో వచ్చిన కారు రాములు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.